ప్రజాశక్తి

సోమవారం 20 మార్చి 2023 | 5 | విజయనగరం



క్రీడల్లో పిల్లలను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తల్లిదండ్రులు పిల్లలను చదువుతోపాటు క్రీడల్లో కూడా ప్రోత్సహించాలని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి కోరారు. జిల్లాకు చెందిన ఫెన్సింగ్ క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి, జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో ఆదివారం జిల్లా చీఫ్ కోచ్ డివి చారి ఆధ్వర్యంలో వారు మర్యాదపూర్వకంగా శ్రావణిని కలిశారు. ఈ నెల 24 నుంచి 28 వరకు పూణెలో జరిగే జాతీయస్థాయి పోటీలకు హాజరవుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా శ్రావణి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు జి.ఈశ్వర్ కౌశిక్, రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి మండలి డైరెక్టర్ ఎస్.బంగారునాయుడు క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రావణి మీడియాతో మాట్లాడుతూ ఆటలు పిల్లలను ఉత్సాహంగా ఉంచుతాయని, వారిలో పోరాట స్ఫూర్తిని కలిగిస్తాయని చెప్పారు. ఫెన్సింగ్ క్రీడాకారులకు కావలసిన మౌలిక వసతుల కల్పనకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. జాతీయ స్థాయి పోటీలలో మంచి ప్రతిభ కనబరిచి విజయనగర ఖ్యాతిని మరింత ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు.

అంగన్వాడీలపై ఉక్కుపాదం

- 'చలో విజయవాడ'ను భగ్నం చేసేందుకు యత్నం
- జిల్లా వ్యాప్తంగా గృహ నిర్బంధాలు
- 91 మంది అరెస్టు

అంగన్వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సోమవారం చేపట్టే చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు ఉక్కుపాదం మోపారు. జిల్లా వ్యాప్తంగా అణిచివేత చర్యలకు, నిర్బంధాలకు దిగారు. చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లనియకుండా పోలీసులు ఆదివారం ఉదయం నుంచి అంగన్వాడీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, ముఖ్య కార్యకర్తల ఇళ్లకు వెళ్లి, బయటకు రాకుండా గృహనిర్బంధాలకు దిగారు. ఎక్కడికక్కడే అరెస్టులకు పాల్పడి, భయభ్రాంతులకు గురిచేశారు.

బొబ్బిలి రైల్వేస్టేషన్ వద్ద అంగన్వాడీలను అరెస్టు చేసి ఆటోలో తరలిస్తున్న పోలీసులు

గృహ నిర్బంధంలో ఉన్న అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి అనసూయ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా విజయనగరంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు, గంట్యాడలో జిల్లా ప్రధానకార్యదర్శి అనసూయతోపాటు అనేక చోట్ల అంగన్వాడీలను, సిఐటియు నాయకులు ఇళ్ల నుంచి బయటకు రాకుండా నిర్బంధించారు. చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్తున్న సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు టివి రమణతోపాటు అంగన్వాడీలు సుమారు 20 మందిని పోలీసులు సంతకాల వంతెన వద్ద అరెస్టు చేసి, వన్‌టౌన్ స్టేషన్‌కు తరలించారు. రాత్రి 10 గంటల వరకూ స్టేషన్‌లో ఉంచారు. పోలీసుల తీరుపై సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ నాయకులు టివి రమణ ఆగ్రహం వ్యక్తంచేశారు. రాత్రి 10 గంటల వరకూ మహిళలను విడుదల చేయకపోవడం దారుణమన్నారు.

గృహ నిర్బంధం అన్యాయం

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరితే గృహ నిర్బంధానికి పాల్పడటం దారుణమని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వి.లక్ష్మి, జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.అనసూయ ఖండించారు. అంగన్వాడీలకు తెలంగాణా కన్నా అదనంగా వేతనాలు పెంచుతామని ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీ అమలు చేయాలని డిమాండ్‌చేశారు. ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వీటన్నింటిపై బడ్జెట్ సమావేశాల సందర్భంగా సోమవారం శాంతియుతంగా ధర్నా చేయాలని నిర్ణయిస్తే, ప్రభుత్వం అంగన్వాడీలను భయభ్రాంతులకు గురిచేసేలా వ్యవహరించడం దారుణమన్నారు. నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని హెచ్చరించారు. అణచివేత చర్యలను విడనాడి, సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టిపెట్టాలని హితవుపలికారు.

రైల్వేస్టేషన్లలో అరెస్టులు

బొబ్బిలి : చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్తున్న అంగన్వాడీలను రైల్వేస్టేషన్లో పోలీసులు అరెస్టు చేశారు. చలో విజయవాడ వెళ్లేందుకు బొబ్బిలి, సాలూరు, పాచిపెంట, రామభద్రపురం, తెర్లాం, బలిజిపేట, బాడంగి, తదితర మండలాల నుంచి బొబ్బిలి రైల్వేస్టేషన్‌కు భారీగా అంగన్వాడీలు చేరుకున్నారు. వారిని పోలీసులు అరెస్టు చేసి ఆటోలతో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సుమారు 30 మంది అంగన్వాడీలను అరెస్టు చేశారు. ప్రభుత్వం, పోలీసులకు వ్యతిరేకంగా అంగన్వాడీలు నినాదాలు చేశారు. రాత్రి 7.30 గంటల తరువాత విడుదల చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావును పోలీసులు గృహనిర్బంధం చేశారు. సిఐటియు మండల అధ్యక్షులు ఎ.సురేష్‌ను జె.రంగరాయపురంలో అరెస్టు చేసి, స్టేషన్‌కు తరలించారు. ఎఐటియుసి జిల్లా నాయకులు ఒమ్మి రమణ, కోట అప్పన్నను ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.

బాడంగి : చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్తున్న అంగన్వాడీలను డొంకినవలస రైల్వేస్టేషన్ ఎస్ఐ జయంతి ఆధ్వర్యాన పోలీసులు అరెస్టుచేశారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు రమణమ్మతోపాటు మొత్తం 16 మందిని బాడంగి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వారిని విడుదల చేశారు.

పూసపాటిరేగ : చలో విజయవాడ కార్యక్రమానికి హాజరుకాకుండా సిఐటియు నాయకులు బచ్చల సూర్యనారాయణతోపాటు మండలంలోని అంగన్వాడీలను ముందస్తుగా పోలీసులు అరెస్ట్ చేశారు. సుమారు 25 మందిని స్థానిక పోలీస్ స్టేషనుకు తరలించారు. ఎఎస్ఐ సురేష్ మాట్లాడుతూ చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని, పూచీకత్తులపై వీరిని విడుదల చేస్తామని తెలిపారు.

పూసపాటిరేగ.. స్టేషన్‌లో ఉన్న అంగన్వాడీలు, సిఐటియు నాయకులు

బాడంగి.. డొంకినవలస రైల్వేస్టేషన్ వద్ద అంగన్వాడీలను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ఎయిర్‌పోర్టు ఎప్పటికో?

నిర్వాసితుల ఇళ్లను తొలగిస్తున్న జెసిబి (ఫైల్)

భోగాపురంలో తలపెట్టిన అంతర్జాతీయ విమానాశ్రయం ఇప్పట్లో అందుబాటులోకి వచ్చే అవకాశం కనిపించడం లేదు. అనేక సదుపాయాలతో తలపెట్టిన ఈ విమానాశ్రయానికి భూసేకరణ దాదాపు పూర్తయింది. ఇటీవలే నిర్వాసితులను కూడా ఖాళీ చేయించారు. ఆయా గ్రామాల్లో ఇళ్లను నేలమట్టం చేశారు. పునరావాసానికి నోచుకోనివారు సైతం ఇక్కడి నుంచి ఎక్కడెక్కడికో పోవాల్సి వచ్చింది. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి మాత్రం ప్రభుత్వం నిధులు కేటాయించలేదు. దీంతో, 2023 ఏడాది చివరికి పూర్తిచేయాలన్న లక్ష్యం నెరవేరే పరిస్థితులు కనిపించడం లేదు.

- భూసేకరణ పూర్తి
- ఖాళీ అయిన గ్రామాలు
- ఏడాదికి 18 మిలియన్ల ప్యాసింజర్ల సామర్థ్యం
- పూర్తిచేయాల్సిన సమయానికి ప్రారంభానికి నోచని పనులు
- నిధులు కేటాయించని ప్రభుత్వం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విశాఖపట్నం ఎయిర్‌పోర్టు ఏటా 10 లక్షల మంది ప్యాసింజర్లకు సేవలందిస్తోంది. విశాఖపట్నం రోజురోజుకూ అభివృద్ధి చెందుతోంది. పారిశ్రామిక కేంద్రంగా మారింది. అనేక ఉత్పత్తుల ఎగుమతి, దిగుమతులు నిత్యం జరుగుతుంటాయి. పర్యాటక కేంద్రంగానూ దేశ, విదేశాలను ఆకర్షిస్తోంది. ఇటీవల రాజకీయ కేంద్రంగానూ మారింది. ఈ నేపథ్యంలో విశాఖ కేంద్రంగా విమాన ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ముఖ్యంగా దేశీయ ఎయిర్‌పోర్టు. దీనికితోడు పూర్తిగా నౌకాదళ ఆధీనంలో నడుస్తోంది. దానికి ఆనుకుని భూమిలేదు. ఎయిర్‌పోర్టుకు ఆనుకుని అనేక పరిశ్రమలు ఉన్నాయి. పొల్యూషన్ ఎక్కువగానే ఉంది. ఇన్ని అవాంతరాల మధ్య విశాఖ ఎయిర్‌పోర్టును విస్తరించే అవకాశం లేకపోవడంతో విశాఖకు చేరువలో ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాలు భావించాయి. ప్రత్యామ్నాయంగా విశాఖకు దరిదాపుల్లోనే అంతర్జాతీయ విమానాశ్రయ ఏర్పాటుకు 2012లోనే అధ్యయనం మొదలైంది. తొలుత విశాఖ జిల్లా అచ్యుతాపురం, ఎస్.రాయవరం మండలాల్లో ఏర్పాటు చేసేందుకు భూములు పరిశీలించారు. అనంతరం భీమిలిలోనూ పరిశీలన చేశారు. చివరికి మన జిల్లాలోని భోగాపురం మండలంలో తలపెట్టి భూమి సేకరించారు. అనేక అధ్యయనాల అనంతరం భోగాపురం మండలంలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి నిర్ణయించారు.

ఎయిర్‌పోర్టుకు తొలుత 5,311 ఎకరాలు సేకరించాలని అప్పటి టిడిపి ప్రభుత్వం ప్రయత్నించింది. స్థానికుల నుంచి పెద్దఎత్తున వ్యతిరేకత రావడంతో 2,703 ఎకరాలకు తగ్గించారు. ఈ విస్తీర్ణంలో ఏరోసిటీ, మెయింటైనెన్స్, రిపేర్స్ అండ్ ఓవర్ హాల్ సౌకర్యం, ఏవియేషన్ అకాడమీతో కూడిన అంతర్జాతీయ ప్రమాణాల గల విమానాశ్రయం ఏర్పాటు చేస్తామని చెప్పింది. తొలుత నిర్ణయించుకున్న ప్రకారం 2023 నాటికి ఎయిర్‌పోర్టు నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. ఫేజ్-1 పూర్తికాగానే టెర్మినల్ హ్యాండ్లింగ్ సదుపాయం అందుబాటులోకి వస్తుంది. తద్వారా ఏడాదికి 6.3 మిలియన్ల ప్యాసింజర్లకు సేవలందించేందుకు అవకాశం ఉంటుందని ప్రభుత్వం, నిర్మాణ సంస్థల అంచనా. ఫేజ్-2 పనులు పూర్తయ్యే నాటికి ప్యాసింజర్ల సామర్థ్యం 18 మిలియన్లకు పెరుగుతుంది. ఈ మేరకు ప్రముఖ నిర్మాణ సంస్థ జిఎంఆర్‌తో ప్రభుత్వానికి ఒప్పందం కుదిరింది. కానీ, 2019 ఫిబ్రవరి 15న సాధారణ ఎన్నికలకు ముందు అప్పటి సిఎం నారా చంద్రబాబునాయుడు హడావుడిగా ఎయిర్‌పోర్టు శంకుస్థాపన చేసినా, భూసేకరణ పూర్తికాకపోవడం, నిధులు కూడా లేకపోవడం వల్ల నిర్మాణం జరగలేదు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసిపి 500 ఎకరాలను మినహాయించి 2,203 ఎకరాలను కేటాయించింది. ఇందులో కోర్టు వివాదంలో ఉన్న 40 ఎకరాలు మినహా మిగిలిన భూమంతా సేకరించారు. ఇటీవలే నిర్వాసితులను కూడా తరలించి, గ్రామాల్లో ఇళ్లను నేలమట్టం చేశారు. చంద్రబాబు మాదిరిగా జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కూడా నిధులు కేటాయించకపోవడంతో పనులు ప్రారంభానికి నోచుకోలేదు. అధికారులు మాత్రం ఏడాదిగా అదిగో ఇదిగో.. అంటూ హడావుడిగా చేస్తున్నారు. నిధులు కేటాయించి, కోర్టు వివాదంలో ఉన్న భూమి కూడా తమకు అప్పగిస్తే పనులు ప్రారంభిస్తామని జిఎంఆర్ సంస్థ చెబుతున్నట్టు సమాచారం. ఈ ఏడాది బడ్జెట్ సమావేశంలో అందుకు తగ్గట్టు కేటాయింపులు చేయలేదని పలువురు విమర్శిస్తున్నారు.

రాష్ట్రంలో దుర్మార్గ పాలన

విజయనగరంకోట : రాష్ట్రంలో వైసిపి దుర్మార్గమైన పాలనలో మహిళకు న్యాయం జరగదని ఎపి మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గా భవాని పేర్కొన్నారు. ఆదివారం సిపిఐ కార్యాలయంలో జిల్లా మహిళా సమాఖ్య నిర్మాణ సమావేశాన్ని మజ్జి మాణిక్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాభవాని, రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ విమల మాట్లాడుతూ మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ఇఎంఎస్, మల్లు చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న తమ్మినేని, తదితరులు

46,099 మందికి రూ.27.85 కోట్లు

జగనన్న విద్యాదీవెన నిధులు విడుదల

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న విద్యా దీవెన పథకంలో భాగంగా జిల్లాలో 46,099 మంది లబ్ధి పొందారు. జిల్లాలోని వివిధ కళాశాలల్లో పలు కోర్సులు చదువుతున్న విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.27,85,91,442 నిధులు జమయ్యాయి. 2022 అక్టోబర్ - డిసెంబర్ త్రైమాసికానికి సంబంధించిన నిధుల విడుదల కార్యక్రమాన్ని సిఎం జగన్.. ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నుంచి ఆదివారం ప్రారంభించారు. అనంతరం రూ.27.85 కోట్ల మెగా చెక్కును కలెక్టర్ ఎ.సూర్యకుమారి, డిఆర్ఒ ఎం.గణపతిరావు, సాంఘిక సంక్షేమ శాఖ డిడి రత్నం, ట్రైబల్ వెల్ఫేర్ డిడి చంద్రశేఖర్, బిసి వెల్ఫేర్ ఆఫీసర్ యశోధనరావు, మైనారిటీ వెల్ఫేర్ అధికారి లావణ్య లబ్ధిదారులకు అందజేశారు.



చెక్కు అందజేస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు ఉద్యమం

సిపిఎస్‌ను రద్దు చేయాలి : యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మూడు కిలోమీటర్ల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను విలీనం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా, ప్రభుత్వ విద్యా రంగాన్ని పరిరక్షించుకోవడం కోసం ఉపాధ్యాయులు ఉద్యమించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రమేష్‌చంద్ర పట్నాయక్ అధ్యక్షతన జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మూడు కిలోమీటర్ల పరిధిలో ఉన్న ప్రభుత్వ స్కూళ్లను విలీనం చేయాలని చూస్తోందన్నారు. ఇప్పటికే కిలోమీటర్ పరిధిలో ఉన్న బడులను విలీనం చేయడం వల్ల అనేక పాఠశాలలు మూతపడ్డాయని, పేద విద్యార్థులు ప్రయివేటు విద్యాసంస్థలకు వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తిందని ఆందోళన వ్యక్తంచేశారు. ఎన్ఇపిలో భాగంగా మళ్లీ మూడు కిలోమీటర్ల పరిధిలో ఉన్న పాఠశాలలను విలీనం చేస్తే మొత్తం ప్రభుత్వ విద్యా రంగం మూతపడి, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు పోవడంతో పాటు పేదలకు ప్రభుత్వ విద్య అందని ద్రాక్ష అవుతుందన్నారు. సిపిఎస్ రద్దు చేస్తామని సిఎం జగన్ చెప్పి నాలుగేళ్లు అవుతున్నా నేటికీ ప్రభుత్వం రద్దు చేయకపోవడం అన్యాయమన్నారు. వెంటనే సిపిఎస్ రద్దు చేసి, ఒపిఎస్‌ను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జులైలో 11వ పిఆర్‌సి కమిషన్ కాలపరిమితి ముగుస్తుందని, వెంటనే కొత్త పిఆర్‌సి కమిషన్ వేయాలని కోరారు. ఉపాధ్యాయులకు బకాయి ఉన్న డిఎ ఎరియర్స్, ఎపిజిఎల్ఐ, పిఎఫ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, డి.రాము, జిల్లా ప్రధాన కార్యదర్శి జెవిఆర్‌కె ఈశ్వరరావు, గౌరవ అధ్యక్షులు సత్య శ్రీనివాస్, జిల్లా నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా కౌన్సిల్లో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్

నూతన కమిటీ ఎన్నిక

జిల్లా కౌన్సిల్లో యుటిఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రమేష్‌చంద్ర పట్నాయక్, జెవిఆర్‌కె ఈశ్వరరావు, గౌరవ అధ్యక్షులుగా ఎ.సత్య శ్రీనివాస్, సహాధ్యక్షులుగా వి.ప్రసన్న కుమార్, జి.పార్వతి కోశాధికారిగా సిహెచ్.భాస్కర రావు, కార్యదర్శులుగా ప్రసాద్, వాసు, త్రినాథ్, పి.వాసు, రామినాయుడు, సూర్యారావు, తిరుపతినాయుడు, జివి రమణ, రాజారావు, కేశవ, రాధా భవాని, శ్రీదేవి, ఎన్.సత్యనారాయణ ఎన్నికయ్యారు. రాష్ట్ర కౌన్సిలర్లుగా కె.విజయగౌరి, డి.రాము, కె.శ్రీనివాసరావు, ఎం.అప్పలనాయుడు, కె.అప్పారావు, జి.పద్మావతి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎ.శంకరరావు ఎన్నికయ్యారు.

ఇఎంఎస్, మల్లు ఆశయాలు సాధిద్దాం

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇఎంఎస్ నంబూద్రిపాద్, మల్లు స్వరాజ్యం ఆశయాలు సాధిద్దామని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఇఎంఎస్, మల్లు స్వరాజ్యం వర్ధంతి సభలను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నంబూద్రిపాద్ సిపిఎం అఖిల భారత కార్యదర్శిగా ప్రజాపోరాటాలు నిర్వహించి తన జీవితాన్ని ప్రజల కోసం, పార్టీ అభివృద్ధి కోసం ధారపోశారని పేర్కొన్నారు. దోపిడీ విముక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం తుపాకీ పట్టిన వీరవనితని కొనియాడారు. స్త్రీ విముక్తి కోసం మహిళా ఉద్యమాన్ని నిర్మించడంలో కీలకపాత్ర పోషించారని తెలిపారు. ప్రజా ఉద్యమాలను ముందుండి నడిపిన కమ్యూనిస్టు ఆదర్శనేతలని, వారి ఆశయాలను సాధించడం కోసం అందరం కృషి చేద్దామని ప్రతినబూనారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ, జి.శ్రీను, సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి కె.సురేష్ పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యాన..

తెలంగాణా సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి సభను కనపాకలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ మాట్లాడుతూ తెలంగాణా సాయుధ పోరాటంలో స్వరాజ్యం తుపాకీ పట్టి పోరాడారని తెలిపారు. దోపిడీ విముక్తి కోసం పోరాటం చేయడమే మల్లు స్వరాజ్యానికి నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతు కన్నీరు

జిల్లాలో 869 ఎకరాల్లో పంటనష్టం

ప్రజాశక్తి-వంగర

అల్పపీడన ప్రభావంతో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతోపాటు ఈదురుగాలుల వల్ల మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. జిల్లాలో వంగర, సంతకవిటి, రాజాం, చీపురుపల్లి, గరివిడి, జామి తదితర మండలాల్లోని 45 గ్రామాల్లో 869 ఎకరాల్లో మొక్కజొన్న పంట నేలకొరిగింది. పడిపోయిన చోట దిగుబడి గణనీయంగా తగ్గే అవకాశముంది. దీంతోపాటు జీడి పిక్కలు నేల రాలడంతో మొక్కజొన్న, జీడి రైతులు కన్నీరు పెడుతున్నారు. వంగర మండలంలోని కొండచాకరాపల్లి, ఎం.సీతారాంపురం, వంగర, శివ్వాం, నీలయ్యవలస, కింజంగి, అరసాడ తదితర గ్రామాల్లో మొక్కజొన్న పంటను రబీలో ఎక్కువగా వేశారు. పంట చేతికందే సమయంలో ఇలా నేలకొరిగిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. మొక్కజొన్న పంట నష్టపోయిన రైతుల వివరాలను వారం రోజుల్లో సర్వే చేపట్టి, నష్ట వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని వ్యవసాయ శాఖ జెడి విటి రామారావు తెలిపారు.

నష్టపోయిన మొక్కజొన్న రైతులను గుర్తించండి

జామి : వర్షాలకు నష్టపోయిన మొక్కజొన్న పంటలను పరిశీలించాలని వ్యవసాయ సిబ్బందికి వ్యవసాయశాఖ జెడి రామారావు ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం అన్నంరాజుపేట గ్రామంలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం 33 శాతం కన్నా ఎక్కువ నష్టం ఉంటే పరిహారం రాయడానికి అవకాశం ఉంటుందన్నారు. మండలంలో ఇప్పటివరకు 20 ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఒ కిరణ్‌కుమార్, గ్రామ సర్పంచ్ సూరిబాబు, వైసిపి నాయకులు శేషు, విఎఎ శివ పాల్గొన్నారు.



వంగర.. నేలకొరిగిన మొక్కజొన్న పంట

జామి.. మొక్కజొన పొత్తులను పరిశీలిస్తున్న జెడి రామారావు

నీటిఎద్దడిపై పక్కా ప్రణాళిక

- 21 నుంచి క్రాష్‌ప్రోగ్రాం ప్రారంభం
- రూ.701 కోట్లతో రెండో విడత జెజెఎం పనులు
- 'ప్రజాశక్తి'తో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఉమాశంకర్ ముఖాముఖి

వేసవిలో తాగునీటి ఎద్దడిని ఎదుర్కోవడానికి పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ పర్యవేక్షక ఇంజినీరు బి.ఉమాశంకర్ తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం ఎటువంటి నీటి సమస్య కూడా లేదన్నారు. రానున్న కాలంలో సమస్య ఎదురైతే దాన్ని ఎదుర్కోవడానికి సర్వం సిద్ధం చేశామని వెల్లడించారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి, అందులో సంబంధిత మండల స్థాయి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు..

\- ప్రజాశక్తి, విజయనగరం

? జిల్లాలో క్రాష్‌ప్రోగ్రాం ఎప్పుడు ప్రారంభం అవుతుంది?.

జిల్లాలో ఈ నెల 21 నుంచి క్రాష్‌ప్రోగ్రాం ప్రారంభమవుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా తాగుబోర్లు, తాగునీటి పథకాలను పరిశీలించి, సమస్యలు గుర్తించి వెంటనే పరిష్కరిస్తారు. ఇప్పటికే వీటికి అవసరమైన మెటీరియల్ కొనుగోలుకు అవసరమైన కాంట్రాక్టర్లను ఫైనల్ చేశాం. ఇప్పటికే మా శాఖ ఇంజినీరింగ్ అధికారులతోపాటు నేను క్షేత్రస్థాయిలో ప్రాజెక్టులను పరిశీలించి సూచనలిచ్చా.

? జిల్లాలో ఎన్ని బోర్లు ఉన్నాయి. వాటి పరిస్థితి ఏమిటి?.

జిల్లాలో 14,406 తాగునీటి బోర్లు ఉన్నాయి. వీటిలో దాదాపు అన్నీ పనిచేస్తున్నాయి. ఎక్కడైనా పనిచేయకపోతే క్రాష్ ప్రోగ్రాంలో వాటిని గుర్తించి బాగుచేస్తారు.

? జిల్లాలో ఎన్ని తాగునీటి పథకాలున్నాయి?.

జిల్లాలో పిడబ్ల్యుఎస్ పథకాలు 965, సిపిడబ్ల్యుఎస్ పథకాలు 30 వరకు ఉన్నాయి. ఇవన్నీ ప్రస్తుతం బాగానే పనిచేస్తున్నాయి. ఎక్కడా ఇబ్బందులు రాకుండా ముందుస్తుగానే ప్రాజెక్టులను పరిశీలించాం. సమస్యలను గుర్తించి, వాటికి అవసరమైన మెటీరియల్‌ను సిద్ధం చేసుకొంటున్నాం. జిల్లాలో భూగర్భ జలాల స్థాయి బాగానే ఉన్నాయి. దీనివల్ల వాహనాలతో నీటిని తరలించి సరఫరా చేయాల్సిన అవసరం ఇంతవరకూ ఏ ఏడాదీ రాలేదు. బహుశా ఈ ఏడాది కూడా రాకపోవచ్చు. ఆ పరిస్థితి వచ్చినా దాన్ని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం.

? వేసవిని ఎదుర్కోవడానికి నిధులు ఏ మేరకు మంజూరు అయ్యాయి?.

వేసవి నీటిఎద్దడిని ఎదుర్కోవడానికి ప్రత్యేకంగా నిధులు అయితే మంజూరు కాలేదు. కానీ 15వ ఆర్థిక సంఘ నిధులను జెడ్‌పి, మండల, పంచాయతీ స్థాయిలో వినియోగించుకోవాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. వాటిని వినియోగించుకొని తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకొంటాం.

? జలజీవన్ మిషన్ పనులు ఎంతవరకు వచ్చాయి?.

జలజీవన్ మిషన్ కింద జిల్లాకు మొదటి ఫేజ్‌లో రూ.200.82 కోట్లతో 1111 పనులు మంజూరయ్యాయి. ఇంతవరకు రూ.109.23 కోట్లు ఖర్చు చేసి 645 పనులు పూర్తి చేశాం. మిగతా పనులు వివిధ దశల్లో ఉన్నాయి. రెండో దశలో రూ.701.71 కోట్లతో 1300 పనులు మంజూరయ్యాయి. అవి ప్రస్తుతం అంచనా, టెండరు దశల్లో ఉన్నాయి. ఈ పనులు మరింత తొందరగా పూర్తి చేసి ప్రజలకు తాగునీరు అందించేందుకు ప్రయత్నిస్తున్నాం.

ముఖాముఖి

దరఖాస్తులు ఆహ్వానం

నెల్లిమర్ల : స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్షలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ కె. ఉషారాణి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. తమ పాఠశాలలో సిబిఎస్‌ఇ సిలబస్‌తో నాణ్యమైన విద్యను అందిస్తామన్నారు. విద్యార్థులకు విశాలమైన డార్మెటరీలు, ఆహ్లాదకరమైన క్రీడా ప్రాంగణంతో పాటు విశాలమైన భోజనశాల వంటి మంచి సదుపాయాలు ఉన్నాయన్నారు. apgpcet.apcfss.in onlineలో ఈ నెల 24 లోపు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

పంటను పరిశీలిస్తున్న నాయకులు

బొబ్బిలి : మండలంలోని నారాయణప్ప వలస గ్రామ పరిధిలో ఉన్న మొక్కజొన్న రైతులు అకాల వర్షాలకు నష్టపోయారని వారిని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంక్షేమ సంఘ అధ్యక్షులు నాయుడు, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మెంబర్ మువ్వల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం నష్టపోయిన పంటను పరిశీలించారు. ఒక్కొక్క రైతు రెండు, మూడు ఎకరాల్లో వేసిన పంట మొత్తం పాడైపోయిందన్నారు. ఎకరా పంటకు రూ.20వేల చొప్పున పెట్టుబడులు పెట్టారన్నారు. అధికారులు దృష్టి సారించి నష్టపోయిన రైతుకు పరిహారం అందించాలని కోరారు.

కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నాయకులు

పెదరామునాయుడు మృతి తీరనిలోటు

వేపాడ : టిడిపి సీనియర్ నాయకులు జాగరపు పెదరామునాయుడు మరణం పార్టీకి తీరని లోటని టిడిపి నియోజకవర్గం నాయకులు గొంప కృష్ణ అన్నారు. మండలంలోని సోంపురంలో ఆదివారం పెద్ద రామునాయుడు సంస్మరణ సభ నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, నాయకులు గుమ్మడి భారతి, సోంపురం సర్పంచ్ మురిపింటి గంగరాజు, మండల అప్పలసూరి, గొర్లె నాగరాజు, లగుడు రవికుమార్, లంక శ్రీను, రెడ్డి పైడి బాబు, సిరికి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి గెలుపు వైసిపికి చెంపపెట్టు

వేపాడ : రాష్ట్రంలో మూడు చోట్ల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి విజయం సాధించడం వైసిపికి చెంప పెట్టు అని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గొంప వెంకటరావు అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల్లో చిరంజీవిరావు గెలుపునకు కృషి చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో కూడా ఇదే స్ఫూర్తితో పనిచేయాలని పిలుపునిచ్చారు.

చీపురుపల్లిలో భారీ అన్నదానం

గరివిడి : చీపురుపల్లి పట్టణంలో శ్రీ శీతలమాత(సంతానలక్ష్మి) అమ్మవారి 39వ జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఆదివారం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వైసిపి అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీ నీలకంటేశ్వర స్వామి దేవస్థానం పాలకవర్గ సభ్యులు ప్రభాత్ కుమార్, కండ్యాన వసంత్, పేకాప ప్రసాద్, కోసూరు సుధాకర్ బాబు, డబ్బాడ ఆనంద్, నాగచైతన్య, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అధికంగా వచ్చిన కరెంటు బిల్లులును చూపిస్తున్న గ్రామస్తులు

ఎస్‌టిలకు కరెంటు బిల్లులు

బాడంగి : మండలంలోని ఎరుకలపాకల గ్రామంలో ఎస్‌టిలకు కరెంటు బిల్లులు ఇస్తున్నారని గజరాయనివలస ఎంపిటిసి పాలవలస గౌరు అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్‌టిలకు 200 యూనిట్ల వరకు కరెంటు ఉచితమని ప్రభుత్వం చెప్పినప్పటికీ అధికారులు బిల్లులు ఇవ్వడమేంటని ప్రశ్నించారు. 100 యూనిట్లు వాడినా అధిక బిల్లులు వేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

నేడు బైక్ వేలం

వంగర : మద్యం కేసులో పట్టుబడిన సిబిజెడ్ వాహనం రాజాం ఎస్ఈబి కార్యాలయంలో నేడు వేలం వేనున్నట్లు వంగర ఎస్ఐ బుడుమూరు లోకేశ్వరరావు తెలిపారు. వేలంలో పాల్గొనలనుకునేవారు రాజాంలో గల ఎస్ఈబి కార్యాలయంలో సోమవారం సంప్రదించాలని తెలిపారు.

స్పందనకు అధికారులు హాజరవ్వండి

వంగర : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరగబోయే స్పందన కార్యక్రమానికి మండల స్థాయి వివిధ శాఖల అధికారులతో పాటు, పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపిడిఒ వావిలపల్లి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

పార్వతీపురం టౌన్ : జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని జనసేన పార్టీ నాయకులు కోరారు. ఆదివారం ఆ పార్టీ జిల్లా నాయకులు విలేకరులతో మాట్లాడుతూ, పార్వతీపురం మన్యం జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గాను జిల్లాలోని మండలాల్లో రైతులకు పంట నష్టం ఏర్పడిందన్నారు. దీనిలో భాగంగా మామిడి, జీడి మామిడి, మొక్కజొన్న, కూరగాయలు, బొప్పాయి, పత్తి, అరటి తదితర పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. తక్షణమే అధికారులు స్పందించి ఆయా గ్రామాల్లో పంట నష్టపోయిన రైతులను గుర్తించి వారికి పంట నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంగల దాలి నాయుడు, బంటు శిరీస్, రాజాన రాంబాబు, కే.అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మను దర్శించుకున్న అవనాపు

విజయనగరం టౌన్ : నగరంలోని మంగళవీధిలో ఉన్న నూకాలమ్మను వైసిపి యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జి అవనాపు విక్రమ్, డిసిఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ నిర్వాహకులు స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు చేయించారు. వార్షికోత్సవం సందర్భంగా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ అధ్యక్షులు గురాన అయ్యలు, కార్యదర్శి యడ్ల రాజేష్, కమిటీ సభ్యులను వారు అభినందించారు.

ద్వారపూడిలో టిడిపి విజయోత్సవం

విజయనగరంకోట : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు విజయం సాధించడంతో ద్వారపూడి గ్రామంలో విజయోత్సవ సంబరాలను టిడిపి మండల అధ్యక్షులు బొద్దుల నర్సింగరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలో ప్రతి పట్టభద్రుని దగ్గరికి వెళ్లి కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటిల్లిపాదికీ ఉపాధి

- జింక్ రేకులతో గృహోపకరణాలు తయారీ
- ఉత్తరాంధ్రలో పలు ప్రాంతాల్లో అమ్మకాలు
- రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలంటున్న తయారీదారులు

ప్రజాశక్తి - రేగిడి

ఆ యువకుడు ఏడో తరగతి వరకు చదువుకున్నాడు. పశ్చిమగోదావరి జిల్లా, పెనుగొండ వెళ్లి రేకులతో వివిధ రకాల గృహోపకరణాలు తయారు చేయడం నేర్చుకుంటూ, కుటుంబ పోషణ కోసం స్వయం ఉపాధి బాట పట్టాడు. జింక్ రేకులతో వస్తువుల తయారీగా మలుస్తూ ఆ కుటుంబం ఇంటిల్లిపాది అదే పనిలో ఉంటూ మరో 30 మంది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్నారు.

మండలంలోని తోకలవలసలో పుట్టి పెరిగి బూరాడ సెంటర్ వద్దకు వలస వచ్చిన సిరిపులు రామకృష్ణ జింక్ రేకులతో వివిధ గృహోపకరణాలు తయారు చేసే పనులు నేర్చుకున్నాడు. ఓ దుకాణంలో కూలీగా చేరిన ఆతను ఆదే దుకాణంలో గృహోపకరణాలు తయారీ నేర్చుకుని బూరాడ జంక్షన్‌లో సొంత నిధులతో వీటి తయారీని ప్రారంభించాడు. 2002-2003 నుంచి ఇదే పని తన తండ్రి సత్యంనాయుడుతో పాటు తల్లి, భార్య ఇతరులకు నేర్పించాడు. తన తమ్ముడు చంద్రమౌళి ఎంఎ, ఎంబిఎ పూర్తి చేసి బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. ఆయన కూడా అన్నయ్య చేసేదే వాదోడుగా నిలవడంతో పాటు రామకృష్ణను గృహోపకరణాల తయారీ రంగంలో ప్రోత్సహించాడు. జింక్ రేకులు ముడి సరుకులు ఇతర ప్రాంతాల నుండి రప్పించి ట్రంకు పెట్లు, బకెట్లు, మీటర్ బాక్సులు, రైస్ డబ్బాలు, మోటార్ క్యాప్‌లు, వస్తువులు దాచుకునే స్టాండ్లు ఇలా

గృహోపకరణాలను తయారు చేస్తున్న రామకృష్ణ కుటుంబ సభ్యులు

రకరకాల వస్తువులు తయారుచేసి ఊరూరా విక్రయిస్తూ కుటుంబం జీవనం సాగిస్తున్నారు. అయితే ముడిసరుకు కొనుగోలుకు ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదని బ్యాంకులో రుణాలు ఇచ్చి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

ఊరూరా అమ్మకాలు

జింక్‌తో తయారు చేసిన వస్తువులను సైకిల్‌తో ఊరూరా వెళ్లి వస్తువులు విక్రయిస్తాం. ఇలా చేస్తే కూలి గిట్టుబాటు కాదు. పలు పట్టణాల, గ్రామీణ ప్రాంతాలకు వెళ్లడం ద్వారానే సరుకులు అమ్మకాలు అవుతాయి. బ్యాంకులో రుణాలు ఇచ్చి ఆదుకోవాలి.

ఎస్ సత్యం నాయుడు, తండ్రి, బూరాడ

బ్యాంకులు ప్రోత్సహించాలి

ఏటా అప్పులు చేసి ముడి సరుకులు పెనుగొండ నుంచి తెస్తాను. పెట్టుబడికి డబ్బులు లేక అరువు తేవడంతో టన్నుకు 12 వేల రూపాయలు అదనంగా కట్టవలసి వస్తుంది. బ్యాంకు రుణాలు ఇచ్చి ప్రోత్సహిస్తే బాగుంటుంది.

రామకృష్ణ, బూరాడ

స్త్రీనిధి ద్వారా రుణాలు ఇప్పిస్తాం

వృత్తిపరంగా చిన్న కుటీర పరిశ్రమలకు సంబంధించి సంఘ సభ్యులు ఉంటే మహిళలు తరఫున స్త్రీనిధి ద్వారా రుణాలు అందజేస్తాం. ప్రభుత్వం కుటీర పరిశ్రమలకు సంబంధించి ప్రోత్సకాలను అందిస్తుంది. దరఖాస్తు చేసుకుంటే రుణాలు అందజేస్తాం.

మంగమ్మ, ఎపిఎం, రేగిడి

'ప్రజ్ఞా వికాస్' విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎస్‌ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రజ్ఞా వికాస్ పరీక్షల్లో విజేతలకు ఆదివారం జెడ్‌పి మినిస్టీరియల్ భవనంలో బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విశాఖపట్నం సీనియర్ ఇంజినీర్ శివానంద్, జెవివి నాయకులు రమణ ప్రభాత్ మాట్లాడుతూ ప్రతి ఏటా పదో తరగతి విద్యార్థుల్లో పరీక్ష భయాన్ని పోగొట్టడానికి, వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రజ్ఞా వికాస్ పరీక్ష నిర్వహించడం పట్ల అభినందించారు. ఎస్‌ఎఫ్ఐ అంటే విద్యారంగ సమస్యలపై పోరాటాల్లోనే కాదు విద్యార్థులకు చదువులో తోడ్పాటు అందించే కార్యక్రమాలు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. జిల్లా మొదటి స్థానంలో పొగిరి శ్యామల (రాజాం, 96 మార్కులు) రెండో స్థానంలో జయేంద్ర నాయుడు(విజయనగరం, 95 మార్కులు), మూడో స్థానంలో లావణ్య(గంట్యాడ), దిలీప్(నెల్లిమర్ల) నిలిచారని తెలిపారు. వీరికి వరుసగా రూ.5వేలు, 3వేలు, 2 వేలు చొప్పున నగదు పురస్కారం, మెమొంటోలను అందజేశారు. అనంతరం యుటిఎఫ్

విజేతలకు నగదు బహుమతులు అందిస్తున్న శివానంద్

జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ ప్రజ్ఞా వికాస్ పరీక్షకు జిల్లాలో 12 వేల మంది హాజరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.రాము, ఎస్‌ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ రామకృష్ణ, సహాయ కార్యదర్శులు ఎం.హర్ష, జె.రవికుమార్, పట్టణ కార్యదర్శి రమేష్, ఎస్‌ఎఫ్ఐ నాయకులు సోమేష్, సంధ్య, కిరణ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి చర్యలు

ప్రజాశక్తి- విజయనగరం

క్షేత్రస్థాయిలో ఉత్తరాంధ్ర పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు మెట్ట రామారావు కోరారు. ఉత్తరాంధ్ర పార్టీ కేంద్ర వర్కింగ్ కమిటీ, కోర్ కమిటీ, కార్యవర్గ సభ్యుల సమావేశాన్ని జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ, మండలస్థాయిలో కమిటీల ఏర్పాటు, సభ్యత్వ నమోదు వేగవంతం చేయడం, పార్టీ విధివిధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రత్యేక ఉత్తరాంధ్ర రాష్ట్ర సాధనే తమ ధ్యేయమన్నారు. యువత కూడా అదే కోరుకుంటున్నారని చెప్పారు. సమావేశంలో పార్టీ విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల ఇన్‌ఛార్జులు కూన రామారావు, పేడాడ జనార్ధనరావు, జగదీష్, సూరజ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

అప్రెంటీస్ సర్టిఫికెట్లతో ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

అప్రెంటిస్ సర్టిఫికెట్ల ద్వారా అభ్యర్థులకు చక్కని ఉద్యోగ అవకాశాలు ఉంటాయని ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ పార్వతీపురం బ్రాంచ్ సీనియర్ మేనేజర్ బి.మురళి అన్నారు. ఆదివారం స్థానిక వాసవి, గాయత్రి విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులకు ఇండియా పోస్ట్ బ్యాంకు ద్వారా అప్రెంటిస్ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వానికి చెందిన ఇండియా పోస్ట్ పేమెంట్ల బ్యాంకు ద్వారా అప్రెంటిస్ పొందిన విద్యార్థులకు చక్కని అవకాశం ఉంటుందన్నారు. పోస్టల్ బ్యాంక్ తదితర కాంపిటేటివ్లో ఈ సర్టిఫికెట్లు ఉపయోగపడతాయన్నారు. కళాశాల కరస్పాండెంట్ పివికె మణికుమార్ చొరవతో తమ ఇండియన్ పోస్టల్ బ్యాంకు ద్వారా విద్యార్థులకు 90 రోజుల పాటు విద్యార్థులకు అప్రెంటీస్ అవకాశం కల్పించామన్నారు. అప్రెంటిస్ కాలాన్ని చక్కగా క్రమశిక్షణతో పూర్తి చేసుకున్న విద్యార్థులను అభినందిస్తూ సర్టిఫికెట్లను అందజేశారు. విద్యార్థులు భవిష్యత్తులో కాంపిటేటివ్‌పై దృష్టి సారించి ఉద్యోగాలు సంపాదించాలని ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ మేనేజర్ సిహెచ్ సాగర్ అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శర్మ, ఎఒలు గౌరీ శంకర్, శ్రీనివాసరావు ఇండియన్ పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు మేనేజర్లు బి.మురళి, సి.హెచ్.సాగర్, హేమంత్, సంతోష్‌ను దుస్సాలువతో సత్కరించారు.

శిక్షణార్థులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న సీనియర్ మేనేజర్ మురళి

మూడు రాజధానులు ఓ కట్టుకథ!

ప్రజాశక్తి- బొబ్బిలి

మాట్లాడుతున్న రంగారావు

ఉత్తరాంధ్రతోపాటు తూర్పు, పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఫలితాలతో ముఖ్యమంత్రి జగన్‌కు కనువిప్పు కలగాలని మాజీ మంత్రి సుజయ్ కృష్ణ రంగారావు అన్నారు. పట్టభద్రులు రాజ్యాంగ స్ఫూర్తిని విలువలను జగన్‌కి తమ ఓటుతో తెలియజేసారని సుజయ్ తెలిపారు. జగన్ అరాచకాలు, విధ్వంసక చర్యలతో పాలన సరికాదని ఓటరు సరైన రీతిలో స్పందన తెలిపారని అన్నారు. మూడు రాజధానాలంటూ మోసం చేసే ప్రకటనలు జగన్ ప్రభుత్వం ఎంతగా చేసినా ఉత్తరాంధ్ర ఓటర్లు ఈ ఎన్నికల ఫలితాలతో బుద్దిచెప్పారని స్పష్టం చేశారు. అటు తూర్పు రాయలసీమ, పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల సహితం, జగన్ మోసకారి ప్రకటనలపై ఓటుతో తగిన రీతిలో స్పందించారన్నారు. జగన్ మూడు రాజధానుల మూడు కళ్ళ సిద్ధాంతం అంతా కపటనాటకమేనని ఉత్తరాంధ్ర వాసులతో పాటు రాయలసీమ ఓటర్లు సహితం తమ ఓటుతో స్పందించారని అన్నారు. ప్రధానంగా పశ్చిమ రాయలసీమలో భాగమైన ముఖ్యమంత్రి సొంత అడ్డ పులివెందుల కడపలో కూడా జగన్ పై వ్యతిరేకత మొదలైందనే విషయం ఈ ఎన్నికలు రుజువు చేయసాయన్నారు. జగన్ విద్యాంసక చర్యలు, తుగ్లక్ నిర్ణయాలు అస్తవ్యస్త పాలనపై జగన్ సొంత ప్రాంత వాసులు ఓటుతో స్పందించిన తీరు అభినందదాయకమని రంగారావు తెలిపారు. ప్రస్తుత పట్టభద్రుల ఫలితాలు భవిష్యత్తు ఎన్నికల ఫలితాలను నిర్దేశించనున్నాయని చెప్పారు. పట్టభద్రుల ఎమ్మెల్సీలుగా విజయం సాధించిన చిరంజీవిరావుకు, శ్రీకాంత్‌కు, రామ్ గోపాల్‌కు అభినందనలు తెలిపారు. ఈ విజయం రాష్ట్రంలో అన్ని వర్గాల్లోనూ ఆనందం నింపిందన్నారు. ఈ విజయంతో రాబోయే ఎన్నికలకు సిద్ధం కావాలని తెలుగుదేశం క్యాడర్‌కు పిలుపు నిచ్చారు.

వృద్ధులకు గౌరవానికి ప్రాధాన్యతివ్వాలి

ప్రజాశక్తి - జామి

వృద్ధులు సమాజానికి అందించిన సేవలు నేటి తరం యువత మరచిపోకూడదని, వృద్ధులను గౌరవంగా చూడవలసిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా సెట్విజ్ అధికారి బి.రామ గోపాల్ అన్నారు. అట్టాడ బి.ఎన్.ఆర్. అశ్రమం మూడోవ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బి.ఎన్.ఆర్.అశ్రమంలో వృద్ధులకి ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించడం తనకి ఎంతో ఆనందం కలిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వృద్ధులను ప్రభుత్వం ఆదుకోవడానికి తగిన చర్యలు తీసుకొంటుందని ఆయన అన్నారు, జిల్లా సైనిక్ సంక్షేమ శాఖ అధికారి మజ్జి కృష్ణారావు మాట్లాడుతూ వృద్ధులకు సేవలు అందించడం గొప్పగా భావించాలన్నారు. మూడోవ వార్షికోత్సవం సందర్భంగా

పంపిణీ చేసిన నూతన వస్త్రాలతో వృద్ధులు

ప్రముఖ పారిశ్రామిక వేత్త డి.ఎస్.టి. నాయుడు, సుస్మా దంపతులు వృద్ధులకి నూతన వస్త్రాలు అందచేశారు. మాతృభూమి సేవా సంఘం ఆధ్వర్యంలో పోజిటివ్ ప్రతినిధులకి పౌష్టికాహారం అందచేశారు. ఈ కార్యక్రమంలో సమన్విత ఏజన్సీ అధినేత గోలుగూరి నాగిరెడ్డి, మాతృభూమి సేవా సంఘం గోపీ, విజయ పోజిటివ్ నెట్ వర్క్ మజ్జి పద్మావతి, నరసింగరావు మాస్టారు, అశ్రమం నిర్వాహకుడు భీశెట్టి ఆధిబాబు, శారదా, డాక్టర్ బాల భార్గవి, భవ్య, ఆశా, సాయి, శిరీష, లోకేష్ కుమార్, కొండబాబు, మీనా, స్రవంతి, అలమండ ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ తేజస్విరెడ్డి పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఖలీలుల్లా

ప్రజాశక్తి - శృంగవరపుకోట

పట్టణంలోని ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీకి చెందిన మహమ్మద్ ఖలీలుల్లా (అస్లాం) ఈనెల 20వ తేది నుండి గోవాలో జరగబోవు జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటున్నట్లు చీఫ్ కోచ్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. గత నెలలో కడప జిల్లా ప్రొద్దుటూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో విజయం సాధించి జాతియ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని అన్నారు. ఎంపికైన అస్లాంకు అభినందనలు తెలియజేస్తూ క్రీడా దుస్తులను, రవాణా ఖర్చులు నిమిత్తం రూ.10 వేలను ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ ఎస్వి సత్యశేఖర్, స్నేహ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు అట్లూరి వెంకటరావు, ఆనల రమేష్, ఆనల మోహన్

టీషర్ట్‌ను అందిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

అందజేశారు. ముంతాజ్ హోటల్ యాజమాన్యం షేక్ సిలార్ బ్రదర్స్ రూ. 10 వేలు బ్యాడ్మింటన్ క్రీడా కిట్‌ను, కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన షేక్ ముగ్దుం రూ. 5 వేల బ్యాడ్మింటన్ షూష్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీ క్రీడాకారులు, తల్లిదండ్రులు, చీఫ్ కోచ్ శ్రీరాముల అభినందనలు తెలియజేశారు.

దాతలు సహకరించాలి

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో ఉదయపురం పంచాయతీ కాకితాడ గ్రామంలో సీతారామ స్వామి ఆలయం నిర్మాణం జరుగుతున్న సందర్భంగా దాతలు సహకరించాలని సర్పంచ్ అరుణ కుమారి కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో సీతారామస్వామి ఆలయం నిర్మాణం చేపడుతున్న సందర్భంగా కొంత మంది దాతలు సహకారంతో స్లాబ్ వరకు వచ్చిందని ఆదివారం స్లాబ్ వేయడం జరిగిందని అన్నారు. ఇంకా గుడి పనులు పూర్తి అవ్వడానికి చాలా నిధులు అవసరం ఉన్నందున దాతలు ఎవరైనా ఉంటే వారికి తోచింది సహాయం చేసి నిర్మాణానికి తోడ్పడాలని కోరారు.

పట్టభద్రులకు కృతజ్ఞతలు: శత్రుచర్ల

జియ్యమ్మవలస : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి చిరంజీవి రావును గెలిపించిన పట్టభద్రులకు మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి జగదీశ్వరి కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం చిన్న మేరంగి శత్రుచర్ల నివాసంలో నియోజకవర్గ టిడిపి నాయకులు, కార్యకర్తలు పట్టభద్రుల ఎమ్మెల్సీ విజయోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ వ్యతిరేకాన్ని తెలియజేస్తూ పట్టభద్రులు మొదట ప్రాధాన్యత ఓటును వేసి చిరంజీవి రావును గెలిపించడం టిడిపి శ్రేణుల్లో ఉత్సాహం పెరిగిందన్నారు. గెలుపు కోసం కృషి చేసిన నాయకులు కార్యకర్తలకు అభినందనలు తెలియజేశారు.

మనసున్న మారాజులు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీ పురం గ్రామంలో ఐదు రోజులపాటు నిర్వహిస్తున్న యాత్ర సందర్భంగా సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన సర్కస్, మ్యూజియం నిర్వాహకులు తుఫాను కారణంగా ఎటువంటి ఉపాధి లేక నిరాశ్రయులయ్యారు. పిల్లాపాపలతో భోజనాలకు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన సర్పంచ్ బి. గౌరీ శంకర్రావు, యాత్ర కమిటీ సభ్యులు భోజనాలు ఏర్పాటు చేసి అందించారు. ఇందుకోసం పలువురు దాతలు విరాళాలు కూడా అందించారు. భోజనాలు అందించిన సర్పంచ్‌కు, దాతలకు వారు ధన్యవాదాలు తెలిపారు. నిరాశ్రయులకు భోజనాలు పెట్టడం పట్ల గ్రామస్తులు అభినందించారు.

జాగ్రత్తలతో మొక్కజొన్నను కాపాడుకోవచ్చు

ప్రజాశక్తి - పాచిపెంట

అధికవర్షాల నుంచి మొక్కజొన్న పంటను చిన్నచిన్న జాత్రలు పాటిస్తే కాపాడుకోవచ్చునని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు తెలిపారు. ఇటీవల కురుస్తున్న భారీ గాలులు, వర్షాలకు మొక్కజొన్నకు పెద్దగా నష్టం వాటిల్లలేదన్నారు. కొన్నిచోట్ల ఆలస్యంగా ఆలస్యంగా నాటిన మొక్కజొన్న పంట ఉందని, దాన్ని కూడా గాలుల నుంచి కాపాడుకోవచ్చునని తెలిపారు. మండలంలో ప్రస్తుతం 3342 ఎకరాల్లో మొక్కజొన్న సాగులో ఉందన్నారు. ఆలస్యంగా నాటిన మొక్కజొన్నలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. వీలైతే వరుసల మధ్యలో గొప్పు తవ్వించి ఎకరాకు 50కేజీల యూరియా, 15 నుంచి 20 కేజీల పొటాష్ కలిపి వేసుకోవాలని తెలిపారు. వర్షాలు తగ్గిన తర్వాత వచ్చే వేడిమికి తెగుళ్లు ఆశించే అవకాశం ఉన్నందున ఎకరానికి 200 మిల్లీలీటర్ల ట్రాఫిక్ ఓనజోల్, 200 మిల్లీలీటర్ల ఇమీడా క్లోప్రిడ్ పిచికారీ చేసుకోవడం ద్వారా రసం పీల్చు


మొక్కజొన్న సంరక్షణపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

పురుగులను, ఆకు ఎండు లేదా ఆకు మచ్చ తెగుళ్లను నివారించుకోవచ్చని రైతులకు సూచించారు. పంట కోసేసి తడిచిపోయిన గింజలపై మొలకెత్తకుండా ఉండాలంటే ఐదు శాతం గెడ్డ ఉప్పు లేదా ద్రావణాన్ని పిచికారి చేసుకుని ఎండ ఎక్కిన వెంటనే ఆరబెట్టుకోవాలన్నారు. దీనివల్ల మొలక రాకుండా వారం రోజులు పాటు నిల్వ చేసుకోవచ్చు అని తెలిపారు. ఆలస్యంగా నాటిన మొక్కజొన్న మతుమూరు, పాంచాలి, కొటికి పెంట రైతు భరోసా కేంద్రాల పరిధిలో ఉందని ఇప్పటికైతే ఎలాంటి నష్టం జరగలేదని తెలిపారు. పంట నష్టం జరిగినట్లయితే వెంటనే కలెక్టర్ కంట్రోల్ రూమ్‌కు తెలియజేస్తామన్నారు.

ఆనందరావు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కళా వెంకటరావు

నిర్మాత కుటుంబాన్ని పరామర్శించిన కళా

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని వావిలవలసకు చెందిన మిధునం నిర్మాత ముయిద ఆనందరావు మృతి చెందడంతో ఆయన సోదరుడు వైసిపి నాయకులు ముయిద ప్రసాదరావు, సర్పంచ్ ప్రసన్న లక్ష్మి కుటుంబాన్ని మాజీ మంత్రి కిమిడి కళా వెంకట్రావు ఆదివారం పరామర్శించారు. ఆనందరావు మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు విద్యారంగంలో సృజనాత్మకత అందించడంలోనూ, పారిశ్రామికవేత్తగా, సినీ నిర్మాతగా ఎంతో పేరు ప్రఖ్యాత సంపాదించారని అన్నారు. ఆయన లేని లోటు రాజాం ప్రాంతానికే తీరనిలోటని విచారణ వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. ఈయనతోపాటు మాజీ ఎంపిపి బొత్స వాసుదేవరావు, టిడిపి నాయకులు సత్యం నాయుడు, రెడ్ క్రాస్ సొసైటీ చైతన్య కుమార్ ఉన్నారు.